


షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

సంపుటి : 2 సంచిక : 34 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ సోమవారం 16 డిసెంబర్ 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 34 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 16 Decmbar 2024 PAGES : 8 PRICE : 5/-

# అమరజీవి స్ఫూర్తితో సుపరిపాలన

- త్వరలోనే రాష్ట్రంలో పొట్టి శ్రీరాములు పేరుతో తెలుగు వర్సిటీ
- పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళులు
- ఏపీలో కొత్త యూనివర్సిటీ.. సీఎం చంద్రబాబు కీలక ప్రకటన



**విజయవాడ**

ఏపీలో త్వరలోనే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీని నెలకొల్పబోతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. తెలుగు వారంతా గర్వంగా చెప్పుకునే రోజు ఈరోజు అని చెప్పారు. ఇవాళ(ఆదివారం) ఉదయం 11 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఉమ్మడి మద్రాసు నుంచి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం.. పొట్టి శ్రీరాములు సాగించిన మహత్తర పోరాటం మరువలేనిదని చంద్రబాబు అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం వల్ల మనమంతా తెలుగు వాళ్లం అంటున్నామని అన్నారు.తెలుగు జాతి కోసం ఆలోచన చేసి ప్రాణత్యాగం ద్వారా సాధించిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. 58 రోజులు ఆమరణ దీక్ష చేసి ఆంధ్రప్రదేశ్ సాధించారని సీఎం చంద్రబాబు అన్నారు. నేటి ఆమరణ దీక్షలు ఎలా ఉన్నాయో - మిగతా3లో



## చంద్రబాబుకు సంపద సృష్టించే శక్తి లేదు

- సీఎం చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ విమర్శలు
- చంద్రబాబు పాలించిన ప్రతి సంవత్సరం కూడా రెవెన్యూ లోటేనని వెల్లడి
- చంద్రబాబు విజన్-2047 డాక్యుమెంట్ పేరిట మరో డ్రామా : వైఎస్ జగన్ ట్వీట్

**అమరావతి**

చంద్రబాబు ముఖ్యమంత్రిగా పరిపాలించిన ప్రతి సంవత్సరం కూడా రాష్ట్రంలో రెవెన్యూ లోటు కనిపించిందని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. ఆయన 14 ఏళ్ల పాలనా కాలంలో ఒక్క ఏడాదైనా మిగులు ఆదాయం కనిపించిందా? మరి ఇంకెక్కడ సంపద సృష్టి? అంటూ ధ్వజమెత్తారు. ఏపీ సీఎం చంద్రబాబు మరో డ్రామాకు తెర తీశారని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆరోపించారు. ప్రజలను మభ్యపెట్టడానికి, మాయచేడానికి ఇదొక ఎత్తుగడ వేశారని ట్వీటర్‌లో ఆరోపించారు. చంద్రబాబు విడుదల చేసిన పత్రంలో రాష్ట్రం - మిగతా3లో



## 'మహా' మంత్రివర్గ విస్తరణ


- 37 మంది ప్రమాణస్వీకారం
- ఫడ్నవీస్ క్యాబినెట్‌లోకి ధనుంజయ్ ముండే.. పంకజ్ ముండే..
- మంత్రులుగా సరిగ్గా పని చేయని వారిని ఏక్ నాథ్ షిండే గ్రూప్ నుంచి నలుగురు, బీజేపీ నుంచి ముగ్గురు, అజిత్ పవార్ గ్రూప్ నుంచి ఇద్దరిని తప్పిస్తారని సమాచారం
- మహారాష్ట్ర క్యాబినెట్ విస్తరణపై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో చర్చించారని సమాచారం


## మనిషికి మరపు సహజం... కానీ...!

- పొట్టి శ్రీరాములు వర్ధంతి
- ఆత్మార్పణ దినంగా పరిగణిస్తున్న ఏపీ ప్రభుత్వం
- విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కార్యక్రమం
- హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విజయవాడ**


అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ దినం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసిన పవన్ కల్యాణ్ ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పొట్టి శ్రీరాములు ఒక జాతికి, ఒక కులానికి నాయకుడు కాదని... ఆయన ఆంధ్ర జాతికి నాయకుడు అని కీర్తించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పించాలంటే ఆర్య వైశ్య సమాజానికి వెళ్లే అవసరం లేకుండానే ఆయనను గౌరవించుకునేలా ఉండాలని పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సభలో ఆయనకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని తెలిపారు. "మనిషికి మరపు సహజం. మనకు అన్నం పెట్టినవారిని, మనకు తోడుగా నిలిచిన వారిని, మనకు అండగా నిలబడిన వారిని మర్చిపోతారు... కానీ అలాంటి వారిని గుర్తుపెట్టుకోవడం చాలా అవసరం. మనం ఎక్కడ్నించి - మిగతా3లో





## జమిలి ఎన్నికల బిల్లుపై వెనక్కి తగ్గిన కేంద్రం

- ఒకే దేశం - ఎన్నిక బిల్లుపై కేంద్రం పునరాలోచన..?
- రేపు పార్లమెంట్‌లో బిల్లు పెట్టేది అనుమానమే..!
- తాజాగా సవరించిన లోక్‌సభ బిజినెస్ జాబితాలో సోమవారం నాటి ఎజెండాలో ఈ రెండు బిల్లులను తొలగించింది
- పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 20న ముగియనున్నారు.
- రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు- 2024, కేంద్రపాలిత ప్రాంతాల చట్టాలు (సవరణ బిల్లు), 2024కి ఆమోద ముద్ర వేసింది.



## ఈవీఎంలపై విశ్వాసం లేకుంటే...

- ఒమర్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు
- గెలిచినప్పుడు ఎన్నికల ఫలితాలను అంగీకరించినప్పుడు, ఓడిపోయినప్పుడు ఈవీఎంలను తప్పుపట్టరాదు
- ఓటింగ్ మిషన్లను విశ్వసించనప్పుడు ఎన్నికల్లో పోటీకి పార్టీలు దూరంగా ఉండాలి
- సిద్ధాంతాల పరంగానే కానీ పక్షపాతంతో తాను మాట్లాడటం లేదు
- సెంట్రల్ విస్టా వంటి మౌలిక వసతుల ప్రాజెక్టుకు తాను సపోర్ట్ చేశా



## దేశాభివృద్ధికి ఒకేసారి ఎన్నికలు ఉపయోగపడతాయి

- ఎక్కువ మంది బిల్లుకు మద్దతు ఇవ్వాల్సి ఉంటుంది
- జమిలీ ఎన్నికలపై పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వ్యాఖ్యలు
- గుంటూరు వీవీఐటీలో గూగుల్ ఏఐ స్కిల్ సెంటర్ ప్రారంభించిన కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని
- ఇటీవల గూగుల్ తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం
- పైలట్ ప్రాజెక్టుగా వీవీఐటీలో స్కిల్ సెంటర్ ఏర్పాటు
- స్కిల్ హబ్‌లో భాగంగానే ఈ సెంటర్ ఏర్పాటు చేసినట్టు పెమ్మసాని వెల్లడి

## పోలవరం సందర్శనకు..

- సీఎం చంద్రబాబు సోమవారం పోలవరం పర్యటన
- భద్రత కారణాల రీత్యా పోలీసులు పాపికొండల విహారయాత్రపై తాత్కాలిక ఆంక్షలు
- ఆది, సోమవారం పాపికొండల విహారయాత్రను అధికారులు తాత్కాలికంగా నిలుపుదల
- వచ్చే ఏడాది జనవరి 2 నుంచి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ఇంజినీర్లతో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు.



**అమరావతి**

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం పోలవరం ప్రాజెక్టు పర్యటనకు వెళ్లనున్నారు. భద్రత కారణాల రీత్యా పోలీసులు పాపికొండల విహారయాత్రపై తాత్కాలిక ఆంక్షలు విధించారు. ఆది, సోమవారం పాపికొండల విహారయాత్రను అధికారులు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. ఈరోజు పాపికొండల విహారయాత్ర కు వెళ్ళే 14 ప్రైవేట్ టూరిజం బోట్లు, ఒక టూరిజం బోటు తాత్కాలికంగా నిలుపుదల చేశారు. 2014-19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించేవారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు కాంట్రాక్టర్, అధికారుల - మిగతా3లో

# దేశాభివృద్ధికి ఒకేసారి ఎన్నికలు ఉపయోగపడతాయి

**గుంటూరు జిల్లా:** గుంటూరు వీవీఐటీలో గూగుల్ ఏఐ స్కిల్ సెంటర్ ఏర్పాటు చేశారు. కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నేడు ఈ గూగుల్ స్కిల్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కిల్ హబ్ లో భాగంగానే గూగుల్ తో ఒప్పందం చేసుకున్నట్టు తెలిపారు. ముందుగా వీవీఐటీలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని చెప్పారు.
ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెమ్మసాని సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఐటీలో మంచి ఫలితాలు సాధించవచ్చని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. గూగుల్ తో ఒప్పందం ద్వారా ఏపీకి అంతర్జాతీయంగా మంచి సంబంధాలు ఏర్పడతాయని అభిప్రాయపడ్డారు.
కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని వన్ నేషన్ వన్ ఎలక్షన్ అంశంపైనా స్పందించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల దేశాభివృద్ధికి ఎంతో ఉపయోగం అని వెల్లడించారు. ఈ బిల్లుకు పార్లమెంటులో అత్యధికులు మద్దతు పలకాల్సి ఉంటుందని తెలిపారు. జమిలీ ఎన్నికలపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకే దేశం ఒకే ఎన్నిక మంచిదేనని అన్నారు.



దేశాభివృద్ధికి ఒకేసారి ఎన్నికలు ఉపయోగపడతాయని తెలిపారు. బిల్లు పెట్టిన తర్వాత ఏముందో చూడాలని అన్నారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు ప్రొగ్రెసివ్‌గా ఉంటాయని తెలిపారు. వీవీఐటీలో గూగూల్ ఏఐ స్కిల్లింగ్ సెంటర్‌ను ఇవాళ(ఆదివారం) కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు.
ఎక్కువ మంది బిల్లుకు మద్దతు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. స్కిల్ హబ్‌గా ఏపీని తయారు చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే గూగూల్‌తో ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. వీవీఐటీలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు ద్వారా ఐటీలో మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అంతర్జాతీయంగా ఏపీకి సంబంధాలు ఏర్పాడతాయని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

**జింఖానా వారి సేవలు అభినందనీయం..**

అంతకుమందు.. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో జింఖానా వారి సేవలు అభినందనీయమని ప్రశంసించారు. జీజీహెచ్‌లో నూతన భవనాల నిర్మాణానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇవాళ(ఆదివారం) శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొన్నారు . ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ...లీడర్ షిప్ తీసుకోని ముందుకు వెళ్తున్న జింఖానా సభ్యులు పొదిల ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్మిస్తున్న తల్లి పిల్లల వార్డుకు వినియోగిస్తున్న ప్రతి రూపాయి టాక్స్ చెల్లింపు చేసినవి అవడం ఎంతో ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.

# అమరజీవి స్ఫూర్తితో సుపరిపాలన

-మొదటిపేజీ తరువాయి

అందరూ చూస్తున్నారని అన్నారు. ఒక వ్యక్తి త్యాగం వల్ల భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఆవిర్భవించాయని చెప్పారు. తాను చనిపోయినా పరవాలేదు అని మన తెలుగు వారికోసం ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. ఒక్కోసారి మంచి చేసినా ఎన్నో ఇబ్బందులు పడాలన్నారు. ఆయనకాడి మోయడానికి నలుగురు రాకపోవడం చాలా బాధాకరమని అన్నారు. కనీసం మద్దతు పలికేందుకు కూడా నాయకులు రాలేదని చెప్పారు. అయినా పొట్టి శ్రీరాములు తాను అనుకున్నది సాధించారని తెలిపారు. ప్రాణాలు కోల్పోవడం మాత్రం చాలా బాధాకరమని చెప్పారు. ఇవాళ సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి.. దేశం ఐక్యత కోసం పోరాటం చేశారని తెలిపారు. అలుపెరగని పోరాటంతో ఉక్కు మనిషిగా చరిత్రలో నిలిచి పోయారని సీఎం చంద్రబాబు అన్నారు.

**చివరకు అదే నిజమైంది.**

"మన తెలుగు జాతికి చాలా విచిత్రమైన పరిస్థితులు ఉన్నాయి. తెలుగుజాతి పలుమార్లు విడిపోయింది, కలిసింది.. అనేక ఇబ్బందులు పడ్డాం. 50 సంవత్సరాల పోరాటం, పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం తర్వాత భాషా ప్రయుక్త రాష్ట్రం వచ్చింది. అల్లూరి సీతారామరాజు గిరిజనులను కలుపుకుని యుద్ధం చేశారు. ఆయన ఉంటే ఇబ్బంది అని ఆనాడు చంపించారు తెలుగు జాతికి ఒక రాష్ట్రం కావాలని 1913లో ఆంధ్ర మహాసభ పెట్టారు. తమిళులు రాష్ట్రం ఇచ్చేలోపే బ్రిటిష్ వాళ్లు స్వాతంత్ర్యం ఇస్తారని చెప్పేవాళ్లు. చివరకు అదే నిజమైంది... స్వాతంత్ర్యం వచ్చాకే .. తెలుగు రాష్ట్రం వచ్చింది. మన తెలుగువాళ్లు నాడు మన హక్కుల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారు. అభివృద్ధి చేయడం, మళ్లీకొత్త రాజధానికి వెళ్లడం మన తెలుగు వాళ్లకు పరిపాటిగా మారింది. పొట్టి శ్రీరాములు కారణంగా ఎట్టకేలకు మన తెలుగు వాళ్లకు ఒక రాష్ట్రం ఆవిర్భవించింది. దీక్ష చేసే సమయంలో నెహ్రూ ఆ దీక్ష విరమించాలని టెలిగ్రామ్ పంపినా వెనక్కి తగ్గలేదు. కొన్ని ఉద్యమాలు చూస్తే చాలా విచిత్రంగా ఉంటాయి. పొట్టి శ్రీరాములు బలిదానం తర్వాత పదవులకు చాలా మంది రాజీనామా చేశారు. ఆనాటి ప్రధాని నెహ్రూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఏపీ రాజధాని విషయంలో ఒక్కొక్కరూ ఒక్కో ప్రాంతం చెప్పారు. కర్నూలు రాజధానిగా, గుంటూరులో హైకోర్టు అని తాత్కాలిక ఒప్పందం చేశారు. 1969లో తెలంగాణ కోసం రాష్ట్రంలో ఉద్యమం, జై ఆంధ్రా ఉద్యమం నడిచింది. తెలుగు వాళ్ల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేసిన వ్యక్తి ఎన్టీఆర్" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**అన్ని విధాలా అభివృద్ధి చేశాం**

"పొట్టి శ్రీరాములు యూనివర్శిటీని ఎన్టీఆర్ ఏర్పాటు చేశారు. నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు జిల్లాగా నేను నామకరణం చేశాను. ఆయన నడయాడిన నేలను అన్ని విధాలా అభివృద్ధి చేశాం. ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం ఆ పనులను కూడా నిర్లక్ష్యం చేశారు. పొట్టి శ్రీరాములు యూనివర్శిటీ పేరును కూడా మార్చాలని చూశారు. నవ్యాంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత పొట్టి శ్రీరాములు ఆత్మార్పణదినం గొప్పగా చేయాలని సంకల్పించాం. జాతి ప్రయోజనాల కోసం ప్రాణాలు వదిలిన మహనీయులను మనం స్మరించుకోవాలి. వారి త్యాగాలను భవిష్యత్తు తరాలు తెలుసుకుని ఆ సేవలను గుర్తు చేసుకోవాలి. తెలుగు జాతి అనేక సమస్యలు, ఇబ్బందులు ఎదుర్కొంది. ఆనాడు ప్రపంచంలో నెంబర్ వన్‌లో ఉండేలా హైదరాబాద్‌ను అభివృద్ధి చేశాం. అక్కడ గత పరిస్థితులు, అభివృద్ధి గురించి డిప్యూటీ సీఎంపవన్ కల్యాణ్ కూడా ప్రస్తావిస్తూ ఉంటారు. పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు అమలు చేసి దేశం దశ దిశ మార్చారు. ఎన్టీఆర్ ప్రాంతీయ పార్టీ పెట్టినా, దేశ రాజకీయాలను శాసించారు. 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఇప్పుడు ప్రకటించాం. ఇది ఏపీలో ఉండే ప్రతి వ్యక్తికి , ప్రతి ప్రాంతానికి మార్పునకు దిక్సూచి. తప్పకుండా ఈ ఫలితాలు ద్వారా రాష్ట్రం, ప్రజకు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారు. తప్పకుండా మనందరకీ మంచి రోజులు వస్తాయి.. పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుంది" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**రాష్ట్రాన్ని, దేశాన్ని నాశనం చేశారు**

"కొంతమంది నాయకులు దూరదృష్టితో ప్రజలకు ఎంతో మంచి చేశారు. మరి కొంతమంది తమ స్వార్థం కోసం రాష్ట్రాన్ని, దేశాన్ని నాశనం చేశారు. గత ఐదేళ్లల్లో పొట్టి శ్రీరాములు స్వగ్రామంలో అభివృద్ధి లేకుండా చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ అభివృద్ధి కావాలని పని చేశాం. 2019 తర్వాత మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేశారు. ఒక్క అభివృద్ధి, ఒక్క ప్రాజెక్టు నిర్మాణం లేకుండా చేశారు. ఆరు నెలల పాలనలో వారి తప్పులను సరి చేయడమే సరిపోయింది. సంపద ప్రతిఒక్క కుటుంబానికి అందాలి, జీవన ప్రమాణాలు మారాలి. అందరూ ఆర్థిక అభివృద్ధితో, సంతోషంగా ఉండాలనేదే విజన్ 2047. ఎవరో కుట్రలు చేస్తే మీరు అందులో భాగస్వామ్యం కావద్దు. మీ నెత్తిన చెయ్యి పెట్టి



అధికారంలోకి వచ్చాక మీ ఆస్తులే లాక్కున్న పరిస్థితి. పొట్టి శ్రీరాములు త్యాగాలతో పాటు, గత పాలకుల పాపాలు కుడా గుర్తు ఉంచుకోండి. లక్షా పాతిక వేలకోట్లు విద్యుత్ భారాలు ప్రజలపై మోపారు. ఇప్పుడు కేంద్రంలో మన పరపతి పెరిగింది కాబట్టి నిధులు వస్తున్నాయి. సుస్థిర పాలనతోనే అభివృద్ధి సాధ్యం అని పవన్ కల్యాణ్ తరచూ చెబుతుంటారు. రూ. 4 వేలు పెన్షన్ ఇవ్వడం దేశంలో ఎక్కడా లేదు. ఇబ్బం దులు తాత్కాలికంగా ఉంటాయి... వాటిని అధిగమిస్తాం. మం చితో పాటు మనకు చెడు చేసిన వారినీ గుర్తుపెట్టుకోవాలి. మీరు గుర్తు పెట్టుకోకుంటే రాష్ట్రం మూడు ముక్కలే. 2025 మార్చి 16 నుంచి పొట్టి శ్రీరాములు 125 వ జయంతి ఉత్సవాలు ఘనంగా చేస్తాం. పొట్టి శ్రీరాములు పుట్టిన గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం, ఇంటిని మెమోరియల్‌గా చేస్తాం. రాజధాని అమరావతిలో స్మృతి వనం ఏర్పాటు చేస్తాం. 2047 నాటికి మన తెలుగు వారంతా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి. ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ. 20-30 లక్షలు ఉండాలి" అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

**ఆ సంకల్పంతోనే పని చేస్తాం**

"ఆ సంకల్పంతోనే మేమంతా కలిసి పని చేస్తాం. ఐటీ గురించి నాటి నుంచి నేటి వరకు మాట్లాడే ఏకైక వ్యక్తిని నేనే. ఒక్క బటన్ నొక్కితే చాలు ఏదైనా క్షణాల్లో పని జరుగుతుంది. రైతులకు ధాన్యం డబ్బులు ఇవ్వకుండా పారిపోయారు. మేము రూ. 1650 కోట్లు ఆ బాకీ రైతులకు ఇచ్చాం. రైతు నుంచి ధాన్యం తీసుకున్న వెంటనే డబ్బులు పడే ఆలోచన చేస్తున్నాం. త్వరలోనే వాట్సాప్ గవర్నెన్స్‌ను అమలు చేస్తున్నాం. ఒక్క మెసేజ్‌తో మీ సమస్యలు, ఇబ్బందులు తీరుస్తాం. ప్రజలు కూడా మా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి. దేశంలోనే ఆదర్శవంతంగా ఉండేలా సుపరిపాలన చేయాలనేది మా అభిమతం. అభివృద్ధి, సంక్షేమం, ఆదాయం లక్ష్యంగా పాలన సాగిస్తాం. ఒకేసారి రాష్ట్రంలో అన్ని గ్రామాల్లో సభకు, రూ. 4 వేల కోట్లతో అభివృద్ధి పనులు పవన్ కల్యాణ్ సారథ్యంలో జరుగుతున్నాయి. గోదావరిలో మునిగిన పోలవరంను మళ్లీ పూర్తి చేసేలా పనులు మొదలు పెట్టాం. నమ్మకం పోయిన తరువాత అప్పులు పుట్టని పరిస్థితి. గత పాలకుల వల్ల ఇప్పుడు మన రాష్ట్రం వైపు ఎవరూ చూడటం లేదు. మేము వాస్తవ పరిస్థితి చెప్పి... నిధులకోసం కష్ట పడుతున్నాం. ఐదేళ్ల నిధులు ఒకేసారి డ్రా చేసిన ఘనులు గత పాలకులు. వారివి అన్ని దొంగ బుద్ధులే... అన్నీ దొంగ నాటకాలే.. ఇప్పుడు నిధులు వచ్చే మార్గం లేక.. కొత్త దారులు వెతుకుతున్నాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఎన్నికలకు సిద్ధం అవుతున్న వైసీపీ

**గుంటూరు :** ఏపీలో పోయిన చోట వెతుక్కోవడంతో పాటు రాబోయే ఎన్నికలకు కార్యకర్తలను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకుంటోంది. ఏపీలో ప్రభుత్వాలు ఏవైనా పరిణామాలు ఎలా ఉన్నా విజయం మాత్రం తమదే అంటూ ధీమా వ్యక్తం చేస్తోంది వైసీపీ. అసలు ప్రభుత్వ ఏర్పాటుపై వైసీపీ లెక్క ఏంటి..? ఎన్నికపై జగన్ వ్యూహాలు ఏంటి? ప్రభుత్వం తమదే అంటున్న వైసీపీ నేతల వ్యాఖ్యల వెనక ఉన్న ఆంతర్యం ఏంటి..? అన్నదీ హాట్ టాపిక్‌గా మారింది. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత వైసీపీకి పునర్వైభవం తీసుకువచ్చే దిశగా ఆ పార్టీ నేతలు అడుగులు వేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా మళ్ళీ పర్యటించి, ఏపీలో పట్టు నిలుపుకునేందుకు పార్టీ నేతలను కార్యకర్తలను ఆ పార్టీ అధినాయకత్వం ఇప్పటినుంచే సిద్ధం చేస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి ఫలితాల తర్వాత ఆయా లోటుపాట్లను సరిదిద్ది, నూతన ఉత్సాహంతో ఎన్నికలకు కేడర్‌ను సిద్ధం చేస్తోంది వైసిపి. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కార్యకర్తల్లో నేతలు అంతా చెల్లా చదురవడంతో వారందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు నేరుగా వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆ బాధ్యతలను భుజానికి వేసుకున్నారు. అందులో భాగంగానే ఎన్నికల ఫలితాలు వెలువడిన మూడు నెలల్లోనే కొత్త జిల్లా కమిటీలు, కొత్త అధ్యక్షులు, నూతన నియోజకవర్గ సమన్వయ కర్తలు, నూతన అనుబంధ సంఘాల విభాగాల నేతలను నియమించి పార్టీలో కొత్త జోష్ తీసుకొస్తున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మానిటర్ చేసేందుకు ఎప్పటికప్పుడు కొత్త టీములను సైతం సిద్ధం చేసుకుంటున్నారు వైఎస్ జగన్. ఎన్నికల ఫలితాలపై ఇప్పటికే అన్ని లెక్కలను సిద్ధం చేసుకున్న వైసీపీ, అధినాయకత్వం ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నా, ఇప్పటి నుంచే తమ కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలతో వైసీపీ పూర్తిగా డీలాపడటంతో ఇప్పటి నుంచే ఎన్నికల కోసం వైసీపీ లెక్కలు చేస్తోంది. 2019 ఎన్నికల ఫలితాలను పునరావృతం చేయాలన్న సంకల్పంతో ప్రస్తుతం పార్టీ కేడర్‌ను సిద్ధం చేసుకుంటుంది. జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదించిన నేపథ్యంలో జమిలి ఎన్నికలు వస్తాయన్న యోచనలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఆయా ఎన్నికల్లో కచ్చితంగా వైసీపీ విజయం సాధిస్తుందన్న ఆశాభావం చేస్తుంది. అందులో భాగంగానే గత ఎన్నికల్లో జరిగిన తప్పులు పునరావృత్తం కాకుండా కేడర్‌కు, లీడర్లకు మధ్య గ్యాప్ లేకుండా ఎన్నికల కోసం సమాయత్తం చేస్తోంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే జిల్లాల పర్యటనకు రంగం సిద్ధం చేసుకుంటున్న వేళ జమిలి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి కార్యకర్తకు ప్రతి నేతకు భరోసా ఇచ్చే దిశగా జగన్ అడుగులు వేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతోనే అధినాయకత్వం సైతం రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ సమస్యలపై ఆందోళన చేపట్టడంతో పాటుగా పార్టీకి దూరంగా ఉన్న ప్రతి కార్యకర్తను దగ్గర అయ్యేలా చూడాలంటూ ఆయా జిల్లా నాయకత్వాలకు రాష్ట్ర అధినాయకత్వం స్పష్టమైన ఆదేశాలను పంపింది. ఇప్పటికే వైఎస్ జగన్ కార్యకర్తలపై దాడులు ప్రతి దాడులు జరిగిన చోట పరామర్శల పేరుతో పర్యటనలు చేయడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల పరిధిలో పార్టీ పరిస్థితి నాయకత్వం మార్పు కొత్త అధ్యక్షులు నియామకం రీజనల్ కోఆర్డినేటర్ల బాధ్యతలు అప్పగించడం లాంటి అంశాలను ప్రత్యేకంగా తీసుకొని ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయం వేదికగా వరుస సమావేశంలో నిర్వహించడంతోపాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అవుతున్నారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు పార్టీ తరపున ఎన్నికైన ప్రతి ఒక్కరికి పార్టీ తరపున భరోసా ఇస్తూనే జమిలి ఎన్నికలకు సిద్ధం కావాలంటూ జగన్మోహన్ రెడ్డి నేరుగా పిలుపునిస్తున్నారు. జమిలి ఎన్నికలను పెంచాలని కేంద్రం అడుగులు వేస్తున్న వేళ ఏపీలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సైతం అందుకు తగ్గట్టుగానే తన కార్యాచరణను సిద్ధం చేసుకుంటుంది.

## పోలవరం సందర్శనకు..

-మొదటిపేజీ తరువాయి

నుంచి సమాచారం తెలుకునేవారు. అయితే 2024 ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి సీఎంగా పగ్గాలు చేపట్టిన తర్వాత రెండోసారి ఆయన పోలవరానికి వెళుతున్నారు. సీఎం అయ్యాక ఈ ఏడాది జూన్ 17న మొదటిసారి ఆయన ఆ ప్రాజెక్టును సందర్శించారు. కాగా, తాజాగా మరోసారి పోలవరాన్ని చంద్రబాబు పరిశీలించనున్నారు. అయితే ఈ పర్యటనలో భాగంగా పోలవరం ప్రాజెక్టు గురించి సమగ్ర సమాచారాన్ని అధికారులను అడిగి చంద్రబాబు తెలుసుకోనున్నారు. ముఖ్యంగా దయాఫ్రం వాల్ నిర్మాణం గురించి అధికారులతో మాట్లాడనున్నారు. వచ్చే ఏడాది జనవరి 2 నుంచి కొత్త దయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో ఇంజినీర్లతో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

**అధికారులు అప్రమత్తం..**

సీఎం చంద్రబాబు పోలవరం పర్యటన సందర్భంగా ఏలూరు జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో శనివారం జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. సీఎం రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో చేయాల్సిన ఏర్పాట్ల గురించి అధికారులు, నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎంఈఐఎల్) సిబ్బందికి పలు సూచనలు చేశారు. చంద్రబాబు వచ్చిన సమయంలో ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని వారికి ఆదేశాలు జారీ చేశారు. హెలిప్యాడ్ నుంచి చంద్రబాబు పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. కాన్వాయ్ ట్రయిల్ రన్ నిర్వహించారు. కాగా, సీఎం పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీలతోపాటు స్థానిక అధికారులు, ఎంఈఐఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మనిషికి మరపు సహజం... కానీ...!

-మొదటిపేజీ తరువాయి

వచ్చాం అనేది మర్చిపోకూడదు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం విలువ ఏంటో అర్థమైంది. పొట్టి శ్రీరాములు 56 రోజుల పాటు కఠోర ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ఆంధ్ర రాష్ట్రం సాకారమయ్యేలా చేశారు. కానీ పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానం తర్వాత ఆయన భౌతికకాయాన్ని మోయడానికి నలుగురు కూడా లేని పరిస్థితి బాధాకరం. ఘంటసాల వంటి మహానుభావులు కొంతమంది ఆ రోజు ముందుకొచ్చారు.
ఆయన త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం. పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ప్రతి తరానికి గుర్తుండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మాకు క్యాబినెట్ సమావేశంలో చెప్పారు. ఆ మహనీయుడి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సూచించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అంటూ పవన్ పేర్కొన్నారు.

## చంద్రబాబుకు సంపద సృష్టించే శక్తి లేదు

-మొదటిపేజీ తరువాయి

అవసరాలకు, ప్రజల అవసరాలకు చోటేలేదని, వాస్తవిక దృక్పథం అంతకన్నా లేదని విమర్శించారు. తన మేనిఫెస్టోలో చెప్పినవాటి అమలు మీద ఎప్పుడూ ధ్యాస ఉండదని, ఎప్పుడూ ప్రజలను మోసం చేయడం, ప్రజలను మాయ చేయడం మీదనే తన ధ్యాసంతా ఉంటుందని ఎద్దేవా చేశారు. 1998లో విజన్-2020 పేరిట డాక్యుమెంట్ విడుదల చేయడం ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో అదొక చీకటి అధ్యాయమని అన్నారు. రైతుల ఆత్మహత్యలు , పనులకోసం వలసలు, ఉపాధిలేక, ఉద్యోగాల్లేక అష్టకష్టాలు, వీటన్నింటినీ దాచేసి చంద్రబాబు తన విజన్ చుట్టూ నడిపించిన ప్రచారం అంతా ఇంతా కాదని వెల్లడించారు. మామూలుగానే ఏ రాష్ట్రంలో అయినా కాలం గడిచే కొద్దీ ఆర్థిక వ్యవస్థ కొంచెం పెరుగుతుందని... కానీ సంపద సృష్టి ఎప్పుడూ చేయని బాబు గారు మాత్రం, ఆ పెరుగుదల తన వల్లేనని చెప్పుకుంటుంటారని విమర్శించారు. సంపద సృష్టి అటుంచి ప్రభుత్వ ఆస్తులను అమ్మేసి సంపదను ఆవిరి చేస్తుంటాడని వివరించారు. ప్రభుత్వంలో సృష్టించిన ఆస్తులను చంద్రబాబు తన వారికి అమ్మేసేందుకు ప్రయత్నిస్తున్నారని జగన్ ఆరోపించారు.
పేదరిక నిర్మూలన అమలు కార్యక్రమాలన్నింటినీ తీసివేసి... పేదలను మరింత పేదలుగా తయారుచేస్తున్నాడని... మరి చంద్రబాబుకు విజన్ ఉందని ఎలా అనుకుంటారు? అంటూ జగన్ ధ్వజమెత్తారు. "విజన్-2047 పేరిట చంద్రబాబు మరోసారి పబ్లిసిటీ స్టంట్ కు దిగారు. ప్రజలను మాయచేయడానికి ఇదొక ఎత్తుగడ. 1998లో కూడా చంద్రబాబు ఇలాగే విజన్-2020 పేరిట డాక్యుమెంట్ తెచ్చారు. రాష్ట్ర చరిత్రలో అదొక చీకటి అధ్యాయం. రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు, పనుల కోసం వలసలు వెళ్లారు, ఉపాధి లేక, ఉద్యోగాల్లేక ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. వీటన్నింటినీ దాచిపెట్టి చంద్రబాబు తన విజన్ కోసం నడిపించిన ప్రచారం అంతా ఇంతా కాదు.
స్విట్జర్లాండ్‌కు చెందిన అప్పటి ఆర్థిక మంత్రి పాస్కల్ హైదరాబాద్ వచ్చిన సందర్భంలో విజన్ డాక్యుమెంట్లు పేరిట ఇలా అబద్ధాలు చెప్పేవారిని మా దేశంలో అయితే జైలుకో, లేకపోతే ఆస్పత్రికో పంపిస్తామని కామెంట్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 2014లోకూడా విజన్-2029 డాక్యుమెంట్ ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయిందని విమర్శించారు. తన పరిపాలనలో మొత్తం 3 విజన్లు ప్రకటించిన చంద్రబాబు చిరస్థాయిగా నిలిచిపోయే పని ఒక్కటంటే ఒక్కటి కూడా చేయలేదని దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను గంగలో కలిపిన పాలకుడిని చీటర్ అంటారు కాని, విజనరీ అంటారా? అని ప్రశ్నించారు. విజన్-2047 ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లు చేస్తానంటూ చంద్రబాబు కట్టుకథ చెబుతున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యలకు వైసీపీ దీర్ఘకాలిక పరిష్కారం చూపుతూ అసమానతలు రూపుమాపి, అందరికీ సమాన అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి దిశగా అనేక చర్యలు తీసుకుందని వెల్లడించారు. పేదలకు ప్రవేశపెట్టిన పథకాలు తొలగించి మరింత పేదవాళ్ళుగా చంద్రబాబు తయారు చేస్తున్నాడని విమర్శించారు.

## వైసీపీలో ఆగని షాక్ లు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ఆర్‌సీపికి గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఉదయం మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ రాజీనామా చేశారు. మధ్యాహ్నం భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంథి శ్రీనివాస్ ఆ పని చేశారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించి లేఖ రిలీజ్ చేశారు ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి గ్రంథి శ్రీనివాస్ వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. పార్టీకి దూరంగా ఉన్నారు. ఇతర పార్టీల్లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఏ పార్టీతో చర్చలు పూర్తయ్యాయో కానీ ఆయన రాజీనామా చేశారు. ఇటీవల గ్రంథి శ్రీనివాస్ ఇంట్లో ఐటీ దాడులు జరిగాయి. దాదాపుగా వారం రోజుల పాటు ఆయన వ్యాపార వ్యవహారాల్లో ఉన్న అవకతవకలన్నింటినీ వెలికి తీశారని ప్రచారం జరుగుతోంది. అంతకు మందు నుంచే ఆయన వైసీపీకి దూరంగా ఉన్నారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ఎత్తున అప్పటి విపక్ష నేతలపై కక్ష సాధింపులకు పాల్పడటంతో వైసీపీ ఉంటే తనకూ ఇబ్బందులేనన్న ఉద్దేశంతో ఆయన కొంత కాలంగా సైలెంట్ గా ఉన్నారు. దీనికి కూడా ప్రత్యేకమైన కారణం ఉంది. అదేమిటంటే.. ఆయన 2019 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ పై గెలిచారు. ఆ తర్వాత పవన్ పై అనేక అనుచిత వ్యాఖ్యలు కూడా చేశారు. పలు మార్లు భీమవరంలో జనసేన, వైసీపీ మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచార సమయంలో భీమవరంలో గ్రంథి శ్రీనివాస్ పై తీవ్ర విమర్శలు చేశారు. రౌడీయిజం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రతి వ్యాపారి నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రౌడీయిజాన్ని అణిచి వేస్తామని హెచ్చరించారు. దీంతో కూటమి గెలిచిన తర్వాత తనకు చిక్కులు తప్పవని ఆయన అనుకుంటున్నారు. అయితే ఆయనను జనసేన పార్టీలో చేర్చుకునే అవకాశం లేదు. టీడీపీ లేదా బీజేపీలో చేరేందుకు ఆయన ప్రయత్నాలు చేశారని అంటున్నారు. కానీ ఆయనకు గ్రీన్ సిగ్నల్ రాలేదని చెబుతున్నారు. వైసీపీకి రాజీనామా చేసే నేతల సంఖ్య వరుసగా పెరుగుతోంది. ఇప్పటికే మెజార్టీ సీనియర్ నేతలు యాక్టివ్ గాలేరు. వారిలో వరుసగా రాజీనామా బాట పడుతున్నారు. మరో వైపు కూటమి ప్రభుత్వంపై పోరుబాట పట్టాలని జగన్ అనుకుంటున్న సమయంలో ఇలా వరుసగా నేతలు ఒకరి తర్వాత ఒకరు గుడ్ బై చెబుతూంటడం.. ఆ పార్టీ పెద్దల్ని కూడా కలవర పరుస్తోంది.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com


షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక
ప్రకాశం

# హైవే కిల్లర్ తరహా నేరాలకు పాల్పడిన ముఠా ఆట

- కట్టుహైవే కిల్లర్ తరహా నేరాలకు పాల్పడిన ముఠా ఆట కట్టు
- నేర ప్రవృత్తితో రౌడీయిజానికి పాల్పడితే తాట తీస్తాం
- హై వే పై దారికాచి వాహనం అపహరించిన కేసులో ఇద్దరు అరెస్టు, ఒకరు పరారీ
- సింగరాయకొండ పోలీసులను అభినందించిన ఉన్నతాధికారులు



(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, సింగరాయకొండ, డిశంబర్ 15)

నిత్యం కొత్త తరహాలో హైవే 16 కేంద్రంగా మున్నా భాయ్ ముఠా తరహా నేరాలకు పాల్పడే ముఠా ఆటను సింగరాయకొండ పోలీస్ లు కట్టించారు. 16వ నంబర్ జాతీయ రహదారి కేంద్రంగా ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న వారి పై జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు స్వీయ పర్యవేక్షణలో సింగరాయకొండ పోలీస్‌లు ప్రత్యేక నిఘా పెట్టి నేరాలను అదుపు చేయడంలో భాగంగా ముగ్గురు ముద్దాయిల పై కేసు నమోదు చేశారు. ఈ ముఠాకు చెందిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని, మూడవ వ్యక్తి పరారీలో ఉన్నట్లు సింగరాయకొండ సిఐ చావా హజరత్తయ్య ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరించారు. నేరాలకు పాల్పడిన వారు ఎవరైనా వారికి చట్టపరంగా చర్యలు ఉంటాయని నేరప్రవృత్తి కలిగి రౌడీఇజంకి పాల్పడితే వారు పోలీస్ చర్యలను చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కొత్త తరహా నేరాలకు పాల్పడుతూ 16 వ నంబర్ జాతీయ రహదారి కేంద్రంగా మన్నేరు సమీపం వద్ద కాపు కాచి ఒంటరిగా మోటారు వాహనాల పై వచ్చేవారిని టార్గెట్ చేసి వారిని లిఫ్ట్ అడగడం వాటితోపాటు మోటర్ సైకిల్ ఎక్కి కొంత దూరం వచ్చి తమ ముఠా తో అతని నుండి వాహనాన్ని లాకుని వాహన దారుడిని బెదిరించి వాహనం తో ఉడాయించడం జరుగుతుందని దాన్ని సింగరాయకొండ పోలీస్‌లు ఛేదించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని ముద్దాయిలను రిమాండ్ కి పంపినట్లు ఆయన వివరించారు. ఈ కేసులో ముద్దాయిలు సింగరాయకొండ పోలీస్ స్టేషన్ లో పలు నేరాలకు పాల్పడి చెడునడత గల జాబితాలో ఉన్నవారే నని ముద్దాయిలు కొల్లా సాయి చరణ్ పై రౌడీ షీట్ ఉందని, పసుపులేటి శ్రీకాంత్ పలు నేరాలలో ఉండి పోలీస్ రికార్డులలో ఉన్నాడని ఆయన వివరించారు. ఈ కేసులో ముద్దాయి నాని ప్రశాంత్ పరారీలో ఉన్నాడని, అతని పై పలు నేరాలు ఉన్నాయని సింగరాయకొండ కి రావద్దని పోలీస్ హెచ్చరించినట్లు ఆయన పేర్కొన్నారు. సింగరాయకొండ పోలీస్ స్టేషన్ క్రైమ్ నంబర్ 370/2024 లో బాధితుడు ఉలవపాడు కి చెందిన రావూరి వెంకటేశ్వర్లుకి (తరువాయి 4లో...)

# గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

గిరిజనుల సమస్య ల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అధిక ప్రాధాన్యం ఇచ్చి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. ఆదివారం ఒంగోలులోని రహదారులు మరియు భవనాల శాఖ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో గిరిజనులు మరియు గిరిజన సంఘాల నాయకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. నివాస స్థలాలు, వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందటానికి ప్రామాణికమైన ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఒంగోలులోని మున్సిపల్ వాణిజ్య సముదాయంలో గిరిజనులకు హక్కు మేరకు దుకాణాలు కేటాయించేలా చూడాలని ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ సభ్యుడిని గిరిజనులు కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. గిరిజనులు తన దృష్టికి తీసుకువచ్చిన అంశాలను అనంతరం ఆయన మీడియాకు వివరించారు. ఒంగోలు మండల శివారులో కొత్తపట్నం వెళ్లే రోడ్డులో 55 గిరిజన కుటుంబాలకు ( నక్కల తెగ వారికి ) కేటాయించిన ఇళ్ల స్థలాలు నివాసయోగ్యంగా లేవని, లోతట్టు ప్రాంతం కావడం వలన వర్షాలకు గుడిసెలు మునిగిపోయాయని తెలిపారు. ఈ స్థలాన్ని నివాస యోగ్యంగా మార్చేందుకు లేదా ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించేందుకు 15 రోజుల్లోగా నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ ను కోరారు. కొత్తపట్నం ప్రాంతంలో ఉంటున్న గిరిజనులు చేపల వేటే ప్రధాన వృత్తిగా జీవిస్తున్నారని , వీరికి కూడా ఇతర మత్స్యకారులకు ఇచ్చినట్లుగా గుర్తింపు కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆయన కోరారు. ఈ గుర్తింపు కార్డులు లేకపోవడం వలన ప్రభుత్వం నుంచి లభించే ప్రయోజనాలను గిరిజనులు పొందలేకపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒంగోలు నగరంలోని గిరిజన కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మున్సిపల్ వాణిజ్య దుకాణాల్లో గిరిజనులకు హక్కు మేరకు కేటాయింపులు చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుకు సూచించారు. ఆయా అంశాలపై అప్పటికప్పుడే కమిషనర్ తోనూ, ఒంగోలు తహసీల్దారుతోనూ మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసే నిధులను ఎస్టీ జనాభాను బట్టి తగిన నిష్పత్తిలో ఆ వర్గం వారి ప్రయోజనాల కోసం ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమస్యలపై ప్రత్యక్షంగా తానే వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకుంటానని కమిషనర్ చెప్పినట్లు శంకర్ నాయక్ తెలిపారు. గిరిజనుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అదే స్ఫూర్తితో క్షేత్రస్థాయిలో అమలయ్యేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, గిరిజన సంఘాల నాయకులు పేరం సత్యం, సైదా నాయక్, గంటా సుబ్బారావు, డాక్టర్ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంఘం సభ్యులు రైతుల కోసం బాధ్యతతో పని చేయాలి

నీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులకు మంత్రి డాక్టర్ డోలా అభినందనలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

శనివారం జరిగిన నీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించిన కొండపి



నియోజకవర్గంలోని 6 మండలాల నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులు ఆదివారం నాడు మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని తూర్పు నాయుడుపాలెం లోని క్యాంపు కార్యాలయంలో కలిసి కలిసి పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులకు మంత్రి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం (తరువాయి 4లో...)

# పేదల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడింది

రాష్ట్ర సాంఘీక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

పేదల సంక్షేమానికి, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి స్పష్టం చేశారు. ఆదివారం ఒంగోలు వచ్చిన ఆయన కలెక్టరేట్లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తోందని, ఇందులో ఎటువంటి వెనకడుగు లేదన్నారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పది, ఇంటర్ పరీక్ష ఫలితాలు మరింత



మెరుగుపరిచేలా ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. విద్యార్థులను వారి ప్రతిభ ఆధారంగా కేటగిరీలుగా విభజించి, పరీక్షల్లో మరింతగా రాణించేలా వారికి అవసరమైన బోధన అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తున్నామన్నారు. వందశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాది 40 మంది నీట్ ద్వారా వైద్య విద్యకు ఎంపికయ్యారని, 60 మంది ఐఐటీ, నిట్ లలో ప్రవేశం సాధించారని ఆయన తెలిపారు. సామాజిక పింఛన్లలో అనర్హులను తొలగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం సర్వే కొనసాగుతోందన్నారు. త్వరలోనే కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు.



పౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయంత్రం ఒంగోలు పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద చంద్రుడు దర్శన దృశ్యాన్ని షణ్ముఖ వెలుగు దినపత్రిక స్టాఫ్ ఫొటో గ్రాఫర్ ఉబ్బా అశోక్ తన కెమెరాలో బంధించాడు ఇలా.....

# అమరజీవి ఆదర్శాల స్ఫూర్తితో ముందుకు సాగాలి

– రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను భవిష్యత్తు తరాలకు తెలియజేస్తూ, ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన "ఆత్మార్పణ దినం" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత ఒంగోలులోని సివిఎన్ రీడింగ్ రూమ్ సెంటర్‌లో ఉన్న





పొట్టి శ్రీరాముల విగ్రహానికి మంత్రి, జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పర్యాటకాభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పలు సంఘాల నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్‌లో "ఆత్మార్పణ సభ" నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో మద్రాసు నుంచి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటైందన్నారు. రాష్ట్రం కోసం మాత్రమే కాకుండా దళితులకు దేవాలయ ప్రవేశం కోసం, స్వాతంత్ర్య పోరాటంలో కూడా పొట్టి శ్రీరాములు చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రకాశం జిల్లాతో కూడా పొట్టి శ్రీరాములుకు ఎంతో అనుబంధం ఉందన్నారు. తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు, అభివృద్ధి ఉండాలన్న పొట్టి శ్రీరాములు ఆశయ సాధన దిశగా రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి (తరువాయి 4లో...)

# అమరజీవి ఆదర్శాల స్ఫూర్తితో ముందుకు సాగాలి







నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో పొట్టి శ్రీరాములు నిస్వార్థ పోరాటయోధునిగా గాంధీజీ నుంచి ప్రశంసలు అందుకున్నారని అన్నారు. కుటుంబ సమస్యలు వేధిస్తున్నా స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని, అంతేకాకుండా దేశ స్వాతంత్ర్యంతో పాటే దళితులకు ఆర్థిక , సామాజిక స్వేచ్ఛ కూడా రావాలని అప్పట్లోనే పొట్టి శ్రీరాములు అభ్యుదయ భావంతో ఆలోచించి దళితులకు ఆలయ ప్రవేశం దిశగా కృషి చేశారని కొనియాడారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలంటూ ఆయన చేసిన కృషితోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. అదే పునాదిగా దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని ముందుకి తీసుకువెళ్లి రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందేలా స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంటును రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని అన్నారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నూకసాని బాలాజీ మాట్లాడుతూ జాతి గర్వించదగ్గ వ్యక్తి పొట్టి శ్రీరాములు అని, సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఆయన గుర్తుంటారని అన్నారు. పొట్టి శ్రీరాములు సేవలు, త్యాగాన్ని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాలలో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి అంజల, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, డీఈవో కిరణ్ కుమార్, స్టెప్ సిఈఓ శ్రీమన్నారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు

## హైవే కిల్లర్ తరహా నేరాలకు పాల్పడిన ముఠా ఆట కట్టు




చెందిన మోటారు సైకిల్ ఎపి 39ఆర్ డబ్లు 9006ను స్వాధీనం చేసుకుని ముద్దాయిలు రిమాండ్ కి పంపినట్లు ఆయన వివరించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి తమ సిబ్బందితో కేసును ఛేదించిన ఎస్సై బి.మహేంద్రతో పాటు ఎ ఎస్ ఐ లు మహబూబ్ బాషా, శేషా రెడ్డి, సిబ్బంది తిరుపతి స్వామి, బాబు,సుమన్ లను ఎస్పీ,డిఎస్పీ, లు అభినందించినట్లు సిఐ హాజరత్తయ్య తెలిపారు. అదే విధంగా మరో చోరీ కేసులో అంతర్ రాష్ట్ర నేరస్తుడు పగటి పూట ఇంటి దొంగతనాలకు పాపడుతున్న కందుకూరు మండలం మచవరానికి చెందిన కట్టా మధు బాబుని అరెస్టు చేసి అతని వద్ద నుండి ఆరు లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్ కి పంపినట్లు సిఐ తెలిపారు. ఇతని పై కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్, గుడ్లూరు పోలీస్ స్టేషన్‌లతోపాటు తెలంగాణా రాష్ట్రం సూర్యా పేటలో మూడు కేసులు నమోదై ఉన్నాయని సిఐ తెలిపారు.

## నీటి సంఘం సభ్యులు రైతుల కోసం బాధ్యతతో పని చేయాలి



మంత్రి మాట్లాడుతూ నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యులుగా ఎన్నికైన వారంతా బాధ్యతగా పనిచేయాలని, చివరి ఆయకట్టు వరకూ నీరందేలా కృషిచేయాలని, అలాంటప్పుడే పదవికి సార్ధకత ఉంటుందన్నారు.



# అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా విజయం

సెమీ క్రిస్మస్ వేడుకల్లో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి













(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిశంబర్ 15)
అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా విజయం సాధించానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పెద్ద చర్చిలో గల క్రిస్టియన్ సోదరులు నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి వారిచే కేక్ కట్ చేయించి అందరికీ పంచి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల మద్దతుతోనే విజయం సాధించాలన్నారు. క్రిస్టియన్ సోదరులు అడుగుతున్న స్మశాన వాటికను త్వరలోనే ఎంపీతో చర్చించి ఎంపి గ్రాంటు నుండి స్మశానవాటిక ఏర్పాటు చేసేట్లు చూస్తానని క్రిస్టియన్ సోదరులకు హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి కొంత నిధుల కొరత ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌బాబు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్, తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి రాత్రింబవళ్లు కష్టపడుతున్నారని కొనియాడారు. మార్కాపురం నియోజకవర్గాన్ని కూడా త్వరలో అభివృద్ధి పథంలో నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారీగా క్రిస్టియన్ సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

## సర్వ దీక్షా మాలలు ధరించిన భక్తులకు ఆహ్వానం

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)
మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా లక్ష్మీ పద్మావతి, శిద్దా సుధీర్ కుమార్, శిద్ధా శృతి దంపతులు ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ సోమ వారం రాత్రి 7 గంటలకు ఒంగోలులోని లాయర్ పేట నందు తమ స్వగృహంలో శ్రీ అయ్యప్పస్వామి, దుర్గా అమ్మ వారి అఖండ పడిపూజ మహోత్సవం, భజన జరుగుతుందని మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు, శిద్దా లక్ష్మీపద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, శివస్వాములు, ఆంజనేయస్వాములు, భవాని మాతలు అందరూ ఈ భజన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి హరిహర సుతుని కృపకు పాత్రులు కాగలరని కోరారు.

## ఉలవపాడు గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములకు ఘన నివాళులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 15)
మండల కేంద్రమైన ఉలవపాడు శాఖ గ్రంథాలయంలో ఆదివారం ఆంధ్ర రాష్ట్రం కోసం, అందులోనూ తెలుగు వారి కోసం ఆమరణ నిరాహారదీక్షతో ప్రాణ త్యాగం చేసిన స్వర్గీయ శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా గ్రంధాలయ పాలకుడు డి.కోటేశ్వరరావు ఆ మహనీయుని చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా విద్యార్థులకు చదవటం మాకిష్ట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల చేత నీతి కథలు పుస్తకాలు చదివించడం జరిగింది. ఈ పుస్తకాలు చదవడం వలన విద్యార్థుల్లో మంచి నాలెడ్జ్ పెరుగుతుందని గ్రంథాలయ పాలకుడు డి కొటేశ్వరరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## సాధువులు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఉగ్ర

(షణ్ముఖ వెలుగు, కనిగిరి, డిశంబర్ 15)
భగవాన్ కాశినాయన ఆరాధన మహోత్సవంలో భాగంగా కనిగిరి కాశినాయన గుడిలో నివసించే సాధువులు, వృద్ధులకు ఆదివారం కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు.





## సెల్ టవర్‌ను అడ్డుకున్న స్థానికులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)
ఒంగోలులోని గద్దలగుంట ఎస్సీ కాలనీలో ఒక ఇంటి పై ఇళ్ల మధ్యలో సెల్ టవర్ బిగిస్తుండడంతో, స్థానికులు సెల్ టవర్ పెట్టవద్దని అడ్డుకున్నారు దానివల్ల వచ్చే రేడియేషన్ వల్ల ఇబ్బంది కలుగుతుందని అడ్డుకోవడంతో పనులు ఆపేశారు.



# గ్లోరీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేసిన ఎరిక్షన్ బాబు







(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, డిశంబర్ 15)

యర్రకగొండపాలెం పట్టణంలోని వేగినాటి కోటయ్య కాలనీలో గల గ్లోరీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 100 మంది పాస్టర్లు, పేదలకు యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు అందించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ దైవ మార్గంలో సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న ట్రస్ట్ డైరెక్టర్ ముటుకూరి దేవదానం మంచి కార్యక్రమం ద్వారా పేదలకు, పాస్టర్లకు సేవ అందిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడిచి అయన కృపకు పాత్రులు అవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, టీడీపీ కూటమి నాయకులు చిట్యాల వెంగల్‌రెడ్డి, వేగినాటి శ్రీను, మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, పోక వెంకటసుబ్బయ్య, యర్రగొండపాలెం టౌన్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, ఒంగోలు ఆదిరెడ్డి, క్రైస్తవ సోదర, సోదరీమణులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు జడ్పీటీసీ విజయ్ భాస్కర్





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, డిసెంబర్ 15)

ఆంధ్రరాష్ట్ర సాధనకోసం నిరాహారదీక్షచేసి ప్రాణాలర్పించిన మహాత్యాగమయి పొట్టి శ్రీరాములని యర్రగొండపాలెం జెడ్పీటీసీ సభ్యుడు విజయ భాస్కర్ అన్నారు. యర్రగొండపాలెం పట్టణంలోని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ క్యాంపు కార్యాలయ ఆవరణలో పొట్టి శ్రీరాములు వర్దంతిని నిర్వహించారు. ఈ సందర్బంగా మండల జెడ్పీటీసీ సభ్యుడు విజయ భాస్కర్ పూలమాలలు వేసీ నివాళు లర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కోసం అమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలను అర్పించిన మహాపురుషుడని కొనియాడారు. పదవుల కోసం కాకుండా సత్యము ధర్మం అహింస హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం జీవితాంతం కృషి చేసిన మహానీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కొప్పర్తి ఓబుల్ రెడ్డి, జిల్లాపరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సాబిర్ బాష , వైస్ యంపిపి మందుల ఆదిశేషు మురారిపల్లె సర్పంచ్ ఏకుల ముసలారెడ్డి , యర్రగొండపాలెం సర్పంచ్ అరుణబాయి , గంజివారిపల్లె సర్పంచ్ దుగ్గెం పూడి సుబ్బారెడ్డి , చెన్నంపల్లి సర్పంచ్ తమ్మినేని సత్యానారయణరెడ్డి, మెగుళ్ళపల్లి సర్పంచ్ కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, తమ్మడపల్లె సర్పంచ్ ఇలాకోటి శివారెడ్డి , గురిజెపల్లి సర్పంచ్ పిలిఫ్స్, తదితరులు పాల్గొన్నారు.

# ఒంగోలులో నాదయోగ స్వర విన్యాసం అద్భుతం

## అభ్యుదయ సినీ సంగీత విభావరి











(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

ఒంగోలు నగరంలో నాదయోగ సాంస్కృతిక సంస్థ గాయనీ గాయకుడు పాడిన పాటలు స్వరరాగ గంగా ప్రవాహంగా మారింది. హైదరాబాద్, వైజాగ్, చెన్నై,ఒంగోలుకు చెందిన 30 మంది గాయనీ గాయకులు పాడిన పాటలకు ఒంగోలు సంగీత ప్రియులు మై మరిచిపోయారు. నాదయోగ సాంస్కృతిక సంస్థ ఐదవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన అభ్యుదయ సినీ సంగీత విభావరి ఉర్రూతలూగించింది. ప్రజా గాయకుడు, నాగయోగ సభ్యులు నూక తోటి శరత్ బాబు సారధ్యంలో ఒంగోలులో ఐదవ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. ఈ సందర్భంగా నాదయోగ గాయనీ గాయకులు సినీ అభ్యుదయ గీతాలు అద్భుతంగా అలరించాయి. నాదయోగ అధ్యక్షులు డాక్టర్ నవీన్ నాదయోగ సాంస్కృతిక సమాఖ్య కార్యక్రమాలను వివరించారు. నాదయోగ సాంస్కృతిక సంఘం కేవలం కాకుండా పాటలకే పరిమితం కాకుండా సామాజిక సేవల ను కూడా విస్తృతంగా చేస్తున్నామని తెలిపారు. అట్టడుగు కళాకారులను ప్రోత్సహించటం తో పాటు పేదలకు సహాయ సహకారాలు అందించడంలో నాదయోగ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో కళాక్షేత్ర నిర్మాణానికి సంగీత కళాశాలకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కళల అన్న కళాకారులన్న వారిని గౌరవించుకోవడంలో ఉన్న గొప్పతనం ఇంకొకటి లేదని తెలిపారు. త్వరలో ఆ సంగీత కళాశాల నిర్మాణానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులను గాయని గాయకులను ఆయన అభినందించారు. నగర మేయర్ గంగాడ సుజాత,మండవ మురళీకృష్ణ, హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, డాక్టర్ మండల కమలా సుభాష్,డాక్టర్ చాపల వంశీకృష్ణ,తెళ్ళ అరుణ, ఆడిటర్ ప్రియా, మారెళ్ళ సుబ్బారావు,కొల్లా మధు,హాజరై కళాకారులను అభినందించారు. ఈ సంగీత విభావరిలో నాదయోగ ఫౌండర్ నాగవర్ధిని గణపతి గాయనీ, గాయకులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కేసులలో నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### గత ఐదేళ్లుగా ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చే రిలీఫ్ ఫండ్‌ను విడుదల చేయించాలి

### గిరిజనుల సమస్యల పై ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేసిన గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

ఒంగోలులో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఆదివారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ గిరిజన సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు పాల్గొని ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ కు వినతి పత్రంను అందజేశారు.అనంతరం గంటా సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, గత ఐదు సంవత్సరాలుగా ఎస్సీ,ఎస్టీలకు ప్రభుత్వం ఇచ్చే రిలీఫ్ ఫండ్ రావడం లేదని, అలానే ఒంగోలు పరిధిలోని నక్కలోళ్ళకు గతంలో పట్టాలు ఇచ్చారు కానీ ఇప్పటివరకు ఆ ప్రాంతం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని , దీంతో నక్కలోల్లు రోడ్డున పడ్డారని గంటా సుబ్బారావు ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. అలానే గతంలో కీర్తిశేషులు ఎన్టీ రామారావు ప్రభుత్వంలో పదవ తరగతి చదువుకున్న నిరుద్యోగ ఎస్టీ లకు ఆర్టీసీ జోన్ పరిధిలలో నెల్లూరులో ప్రభుత్వమే డ్రైవర్లు గా శిక్షణ ఇచ్చి, వారే ఉద్యోగాలు ఇచ్చారని, అలానే వైయస్సార్ ప్రభుత్వంలో కూడా అమల్లో ఉండేదని గుర్తూ చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు వాటిని పూర్తిగా విస్మరిస్తున్నాయని తెలిపారు.ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం జగన్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఇవ్వలేదని మా కూటమి ప్రభుత్వంలో ఎస్సీ ఎస్టీలకు సంక్షేమ పథకాలు ఇవ్వడం జరుగుతుందని హామీ ఇచ్చారని తెలిపారు.కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మొన్న జరిగిన ఎన్నికలలో ఎస్సీ ఎస్టీలు విధిగా పాల్గొని ఓటు వేయడం వల్లనే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగలిగిందని ఎస్పీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ ను తెలియచేశారు. అలానే ఎన్ ఎస్ కే ఎఫ్డిసి, ఆదివాసి మహిళా స్వశక్తికరణ పథకం కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని, ఎస్టిలకు బ్యాక్లాగ్ పోస్టులు తీయాలని, గత ప్రభుత్వం ఎస్టీలకు బ్యాక్లాగ్ పోస్టులు తీయలేదని,అలానే డీఎస్సీ లో కూడా ఎస్టీలకు ప్రాణామిక ప్రకారం జరగలేదని తెలియచేశారు. అలానే ఎస్టీలకు అభివృద్ధితో పాటు తమ వంతుగా తోడ్పాటును అందించాలని ఎస్టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ కు వినతి పత్రం సమర్పించారు.అనంతరం స్పందించిన ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్.. ఒంగోలులో నక్కులోలకు ఇచ్చిన స్థలాల్లో వారికి మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కు కోరారు.అనంతరం కలెక్టర్ తో గిరిజనుల సమస్యలపై చర్చించారు.జిల్లాలోని గిరిజనుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుబ్బారావుకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ పేరం సత్యం, సైదా నాయక్, డాక్టర్ బాలాజీ నాయక్, జిల్లా గిరిజనుల వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తోపాటు సూపర్డెంట్ అరుణ, తదితర గిరిజన సంఘ నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

# భోగినేని చెంచు రామనాయుడుకి మాతృ వియోగం



### పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 15)

మండల కేంద్రమైన ఉలవపాడు గ్రామంలోని ఎన్ఆర్ఐ బోగినేని చెంచురామ నాయుడు తల్లి ఆదివారం కన్నుమూశారు. ఆమె పార్థీవ దేహాన్ని కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం సందర్శించి ఆమెకు ఘన నివాళులర్పించారు. ఆయన వెంట కొండప నాయుడు, కృష్ణ, మాజీ సిహెచ్‌సి చైర్మన్ దార్ల మల్లిఖార్జున, మొరిస్సు నారాయణ, మాజీ కోప్షన్ ఎస్‌కె బాజీ, మాజీ ఎస్సీ సెల్ నాయకులు జంగాల శివప్రసాద్, దాసరి శ్రీను, వెలిచర్ల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షులు కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గం ఇంచార్జి చుండూరి రవిబాబు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అమరజివి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వక్తలు మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారి కోసం ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని, ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరుడై తెలుగు వారికీ ఒక రాష్ట్రం ఏర్పడేల తన ప్రాణాలు పణంగా పెట్టి రాష్ట్రాన్ని సాధించాడు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర లలో కొంత భాగం కలిపి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది. ఆ మహనీయుని వలన తెలుగు వారికి ఒక ప్రత్యేక గుర్తింపు, ఒక ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అయ్యిందని కొనియాడారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు నగర అధ్యక్షులు కటారి శంకర్ రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, కే. అదేన్న, ఎన్.కనకరావు మాదిగ, రొండా అంజిరెడ్డి,పెరకంసుబ్బారావు, పి. ఆంజనేయులు, విజయలక్ష్మి,కె. అదేన్న, రమణారెడ్డి,మీరవళి, నరాల రమణారెడ్డి,కరుణాకర్, శ్రీనివాసరెడ్డి, పిగిలి శ్రీనివాసరావు వెంకటేశ్వరెడ్డి పల్నాటి, హౌసింగ్ బోర్డు చిన్న,,కమ్మ సురేష్, నాగుర్ మీరా,బోట్ల సుబ్బారావు, కటారి ప్రసాద్, పి.కోటేశ్వరరావు, ఇమ్రాన్, వెన్నపూస వెంకటరెడ్డి, రమణమ్మ,ముల్లంగి రవీంద్ర రెడ్డి,కాశిరెడ్డి,కుట్టు బోయిన కోటి యాదవ్, కటారి సజీవ్,భాస్కర్,ఉదయగిరి కృష్ణ, పణిదీపు సుధాకర్, సుబ్బారెడ్డి, బత్తుల ప్రమీల , జిలాని బాషా, రాజు నాగిరెడ్డి,జాజుల శ్రీను, పోటీకాల పూడి రాము, దగ్గుమాటి జయటరామిరెడ్డి, గోనెల శివ కుమారు, గోనెల మెరికుమారి,ప్రసన్న కుమారి మధు సుధానరెడ్డి, కె. ఏడుకొండలు, ఆర్టీసీ వెంకటరావు, సురేష్ కుట్టుబోయిన, దేవరకొండ వాణి, రమణమ్మ, ఇంకా అన్ని డివిజన్ల కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# ఘనంగా చందన షాపింగ్ మాల్ ప్రారంభం





**(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, డిసెంబర్ 15)**

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో చందన షాపింగ్ మాల్ నూతనంగా ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త సీనియర్ తెదేపా నాయకులు కొండేపాటి గంగా ప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ప్రముఖ సినీ తార రీతు వర్మ చేతుల మీదగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. పట్టణంలో చందనా బ్రదర్స్ షాపింగ్ మాల్, స్వర్ణ మందిర్ లను గ్రాండ్‌గా ప్రారంభించారు. నాణ్యత కలిగిన బట్టల రంగంలో చందన బ్రదర్స్ షాపింగ్ మాల్ కి ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. పట్టు చీరలు, వివాహాది శుభకార్యాలకు ఇక్కడ కుటుంబ సమేతంగా విచ్చేసి షాపింగ్ చేయవచ్చని అన్నారు. రాష్ట్రంలో మరి ఎక్కడా లేనివిధంగా స్వర్ణ మందిర్లో ప్రత్యేక మోడల్లలో స్వర్ణాభరణాలు, చందన షాపింగ్ మాల్ వారిచే నాణ్యమైన దుస్తులతోపాటు అతి తక్కువ ధరలకే దుస్తులు లభిస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కేరళ డ్రమ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ సినీ తార రీతు వర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చందనా షాపింగ్ మాల్ లో అతి తక్కువ ధరలకు పిల్లలకు పెద్దలకు మరియు బంగారు నగలు షాపింగ్ చేయొచ్చని తెలిపారు.పై కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, తెదేపా నాయకులు సుధాకర్ రెడ్డి, ఆకు తోట రమేష్, కొొక్కు శంకరయ్య,వేలూరు చంద్రయ్య, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 17న పెన్షనర్ల దినోత్సవం

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిశంబర్ 15)**

ఈ నెల 17న మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక పెన్షనర్ల సంఘ కార్యాలయంలో పెన్షనర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం పొదిలి యూనిట్ అధ్యక్షులు ఏ బాదుల్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పొదిలి ఉప ఖజానాధికారి బి చంద్రశేఖర్‌రావు, పూర్వ పొదిలి సబ్ ట్రెజరీ అధికారి ఏవిఎస్ఎస్ ప్రసాద్ లు హాజరవుతారన్నారు. కావున ఈ కార్యక్రమానికి పొదిలి, మర్రిపూడి, కొనకనమిట్ల మండలాల్లోని పెన్షనర్లందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

# ఘనంగా భూమి ఇన్ఫ్రా రియాలిటీ (హ్యాపీ ప్లేసెస్, స్మైలింగ్ ఫేసెస్) ప్రారంభం

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిసెంబర్ 15)**



ఆదివారం చిల్డ్రన్స్ పార్క్ రోడ్డులోని సాయిబాబా గుడి దగ్గర భూమి ఇన్ఫ్రాయాలిటీ ముఖ్య అతిథులు,మందు మిత్రులతో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ఇతర రియల్ ఎస్టేట్ , వ్యాపార ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మేనేజింగ్ డైరెక్టర్ కురపటి శ్రీహరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ముందుగా నా ఆదిత్యాన్ని తీసుకొని ఇక్కడికి వచ్చిన ప్రముఖులకు, నా మిత్రులకు నా కృతజ్ఞతలు ఒక అనుభవం ఉన్న వ్యక్తి , వ్యాపారంలో ఆసక్తి కలిగి ఉన్న ఒక నూతన విద్యార్థి కలిసి ఆలోచించి పెట్టినదే ఈ భూమి ఇన్ఫ్రా రియాలిటీ హ్యాపీ స్ప్లెసెస్ స్మైలింగ్ ఫేసెస్.. మాకు ఆశీర్వదించడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు ఇప్పుడు ఇప్పుడు నెల్లూరులో స్టార్ట్ చేసాము. ముందు ముందు బెంగళూరు, చెన్నై ,హైదరాబాద్ వంటి పెద్ద నగరాలు కూడా మా వ్యాపారం విస్తరించాలని ఆ భగవంతున్ని కోరుతున్నాను. ప్రతి ఒక్కరు వచ్చి ఇక్కడికి విచ్చేసి మా యొక్క పనితీరును గమనించి మాతో పని చేయుటకు ఆసక్తి కలిగి ఉంటారని కోరుకుంటున్నాను అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చైర్మన్ మైల కోటేశ్వరరావు మాట్లాడుతూ..ఈ రియాలిటీ మరియు రియల్ ఎస్టేట్ అందాలను నాకు ఎంతో అనుభవం ఉంది . అనుభవం గురించి అందరికీ తెలిసినదే. అనుభవానికి ఇప్పుడు నూతన ఆలోచనలు తోడయ్యాయి. మా ఈ ఆలోచనలు మరియు అనుభవంతో మునుముందు ఇంకా మంచి మంచి కార్యక్రమాలను మీ ముందు తీసుకువచ్చి, మా పనితీరును మీకు చూపించడం మన సిద్ధంగా ఉన్నాము. మాకు మీ యొక్క ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలందరూ వచ్చి మా యొక్క పనితీరును గమనించి మాతో అనేకమై పనిచేస్తారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. వారి యొక్క తోటి వ్యాపారవేత్తలు ,బంధుమిత్రులు కూడా వారికి కృతజ్ఞతలు తెలిపారు.




# వైసీపీ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 15)**

అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ , ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి. వైఎస్సార్సీపీ నాయకుల నెల్లూరు రాంజీ నగర్‌లోని వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర నియోజకవర్గ కార్యాలయంలో వైసీపీ నాయకులతో కలిసి వైసిపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు వారు గుర్తుచేసుకున్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించారని తెలిపారు. ఈ రోజు ఆయన చేసిన త్యాగాలు మూలంగానే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. ఆయన మన జిల్లా వారు కావడం మనకెంతో గర్వకారణమన్నారు. వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రీ పొట్టి శ్రీరాములు ఆశయాలకు అనుగుణంగా పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వేలూరు ఉమా మహేష్, ఊటుకూరు నాగార్జున, జయలక్ష్మి, వై సి పి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఖలీల్ అహ్మద్, వైసీపీ నాయకులు పెర్నెటి కోటేశ్వరరెడ్డి, సురేంద్ర ధనుజారెడ్డి, సగిలి జయరామిరెడ్డి, రావూఫ్, పెంచలయ్య, శశి, సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# పొట్టి శ్రీరాములు త్యాగాలు అజరామరం

## అమరజీవి ప్రాణ త్యాగంతోనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు

## ఆ మహనీయుని స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలి

## జిల్లాకు ఆ ధన్యజీవి పేరు పెట్టడం మనందరికి గర్వకారణం

## జాయింట్ కలెక్టర్ కార్తీక్

## ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి ఆత్మార్పణ దినోత్సవం

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 15)**

ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాలను పణంగా పెట్టి ఆత్మార్పణం చేసుకున్న పొట్టి శ్రీరాములు త్యాగాలు రాష్ట్ర చరిత్రలో అజరామరంగా నిలిచి ఉంటాయని జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ అన్నారు. కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆదివారం ఆత్మార్పణ దినోత్సవాన్ని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్ఓ ఉదయభాస్కరరావు, పలువురు జిల్లా అధికారులు శ్రీరాములు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. తొలుత పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అమరజీవి చేపట్టిన నిరాహార దీక్ష, స్వాతంత్ర్య సంగ్రామంలో పొట్టి శ్రీరాములు పాత్ర మొదలైన అంశాలతో సమాచార, పౌర సంబంధాలశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రత్యేక వీడియోను జాయింట్ కలెక్టర్, అధికారులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆత్మకూరు జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా అద్భుతంగాదేశ భక్తి గీతాలను ఆలపించి ప్రతి ఒక్కరిలో కూడా దేశభక్తి భావాన్ని, దేశ గౌరవాన్ని పెంపొందించిన సంగీత ఉపాధ్యాయురాలు మల్లాది అనూష, విద్యార్థులను జెసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాలు అజరామరమన్నారు. రాష్ట్ర అవతరణకు, దేశ స్వాతంత్ర్య సమరంలో ఆ మహనీయుని సేవలు స్ఫూర్తిదాయమని, ఇదే స్ఫూర్తితో ఆ మహనీయుని ప్రాణ త్యాగంతో ఏర్పడిన రాష్ట్ర అభివృద్ధికి ప్రతి ఒక్కరు కూడా కృషి చేయాలని జేసీ కార్తీక్ పిలుపునిచ్చారు. పొట్టి శ్రీరాములు గారు మన జిల్లా వాసి కావడం... మనందరి గర్వకారణమన్న జేసీ, గొప్ప చరిత్ర గల ఈ జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో జాతిపిత మహాత్మా గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ పొట్టి శ్రీరాములు గారు అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా మొదలైన ఉద్యమాల్లో కీలక భూమిక పోషించారన్న జేసీ, పొట్టి శ్రీరాములు వంటి వారు 11 మంది అనుచరులు ఉంటే కేవలం ఒకే ఒక్క సంవత్సరంలో బ్రిటిష్ రాజ్యం నుంచి భారతావనికి స్వాతంత్ర్యం తీసుకునే వాడిని అన్న మహాత్మా గాంధీ వ్యాఖ్యలు పొట్టి శ్రీరాములు పోరాటపటిమ, దేశభక్తికి నిదర్శనంగా జేసి కార్తీక్ పేర్కొన్నారు. అలాగే పొట్టి శ్రీరాములుకి నెల్లూరు జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఉందని, సమాజంలో దళితుల ఉద్ధరణ కోసం సహపంక్తి భోజనాలు, ఆలయాల ప్రవేశం వంటి అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. ఆ మహనీయుని త్యాగాలను యావత్ జాతి ఎప్పటికీ చిరస్థాయిగా గుర్తుంచుకుంటుందని జాయింట్ కలెక్టర్ నివాళులర్పించారు. అనంతరం పుణ్యభూమి నాదేశం నమో నమామి, ధన్యభూమి నాదేశం సదాస్మరామి అన్న స్వాతంత్ర్య సమరయోధుల ఘనకీర్తిని ఎలుగెత్తి చాటేలా సోషల్ వెల్ఫేర్ డిడి శ్రీనివాసులు విద్యార్థులతో కలిసి ఆలపించిన దేశభక్తి గీతానికి అందరూ హర్షద్వానాలతో తమ దేశం పట్ల తమకున్న గౌరవం, ప్రేమను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఉదయభాస్కరరావు, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, సోషల్ వెల్ఫేర్ డిడి శ్రీనివాసులు, సమగ్ర శిక్ష ఏపీసి ఉషారాణి, సమాచార శాఖ సహాయ ఇంజనీరు ఎ కిషోర్, ఆత్మకూరు డిప్యూటీ డిఇఓ ఎంవి జానకిరామ్, ఎంఈఓ మురళీధర్, బిసి సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీస్థాయి పోటీ పరీక్షల్లో సైతం

## నారాయణ విద్యా సంస్థల విద్యార్థులే ముందంజ

## జీఎం భాస్కర్‌రెడ్డి





**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిసెంబర్ 15)**

నెల్లూరు నారాయణ మెడికల్ అకాడమి నుంచి 2024 నీట్ పరీక్షలో దాదాపు 350 మందికి పైగా విద్యార్థులు సీట్లు సాధించడం అభినందనీయమని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్క్ రెడ్డి అన్నారు. ఆదివారం నారాయణ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని అడిటోరియంలో 2024 నీట్ సక్సెస్ మీట్ నిర్వహించిన సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 2024 నీట్‌లో జాతీయస్థాయిలో ప్రతిష్టాత్మకమైన మెడికల్ కళాశాల్లో ప్రవేశాలు సాధించేందుకు నారాయణ మైక్రోషెడ్యుల్స్, ఎర్రర్ అనాలసిస్,పేపర్ డిస్కషన్స్ లాంటి ప్రణాళికలు,జాతీయస్థాయి మెటీరియల్,సమర్థవంతమైన అధ్యాపకుల బృందం చేసిన కృషేనన్నారు. ఎలాంటి ఎంట్రన్స్ ఎగ్జామ్స్ అయిన నారాయణ సంస్థల్లో చదువున్న విద్యార్థులు విజయకేతనం ఎగురు వేయడం సర్వసాధరణం అని గర్వంగా చెప్పవచ్చాన్నారు. అనంతరం మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థిని,విద్యార్థులను ఘనంగా సత్కరించి,మెమెంటోలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కోర్ డీన్ జయకుమార్ రాయుడు, డీన్‌లు విష్టువర్దన్ రెడ్డి,,శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి, ఏజీఎంలు పెంచలరెడ్డి, హాజరత్ నాయుడు, గురవయ్య, కృష్ణారెడ్డి, పద్మారెడ్డి, ప్రిన్సిపాల్ , అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం మరువలేనిది

## వైపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి ఎరిక్షన్ బాబు




**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, డిసెంబర్ 15)**

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని, ప్రతి ఒక్కరూ అయన ఆశయాల సాధన దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు చిట్యాల వెంగల్ రెడ్డి , వేగినాటి శ్రీను, మాజీ సర్పంచ్ సత్యనారాయణ గౌడ్, పోక వెంకటసుబ్బయ్య, ఎర్రగొండపాలెం టౌన్ అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, ఒంగోలు ఆదిరెడ్డి, ఆర్యవైశ్య నాయకుడు గోళ్ళ సుబ్బారావు, తదితరుల పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కందులకు కృతజ్ఞతలు తెలిపిన తీగదుర్తిపాడు నీటి సంఘ సభ్యులు



(షణ్ముఖ వెలుగు, పొదిలి, డిశంబర్ 15)
మండలంలోని ఆముదాలపల్లి గ్రామపంచాయతీలో గల తీగదుర్తిపాడు నీటి సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన టిడిపి మద్ధతుదారులుగా నిలిచిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు ఆదివారం పట్టణంలోని ఫైనాన్స్ కార్యాలయంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలవేసి అభినందనలు తెలిపారు. తమ విజయానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ నిడమ నూరి వెంకటేశ్వర్లు, బలరాం, వైస్ చైర్మన్ దరిమడుగు కేదేశ్వరరావు, మెంబర్లు ఆవుల కోటేశ్వరరావు, ఉల్లిపాయలు వెంకటరమణయ్య, భోగిసం పేద సుబ్బారావు, నీలం వీరమ్మ, రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఆవులూరి యలమంద, మండల పార్టీ అధ్యక్షులు మీగడ ఓబుల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ముల్లా ఖుద్దూస్, మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్, బాబ, తదితరులు పాల్గొన్నారు.

## కుర్తాళం పీఠంలో శ్రీగిరి ధర్మ కర్తల ప్రత్యేక పూజలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)
ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మ కర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ట్రస్టీలు ఆలూరు కుమార్ ఆత్రేయ, ఆలూరు జై శంకర్ తదితరులు ఆదివారం తమ కుటుంబ సభ్యులతో కలిసి తమిళనాడులోని కుర్తాళం పీఠాన్ని సందర్శించారు. కుర్తాళం పీఠం108 వ వార్షిక బ్రహ్మోత్సవాలు మరియు 23వ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా సిద్దేశ్వరి పీఠంలో ఏర్పాటైన దర్బారు సేవ, స్వర్ణ పుష్పార్చన, మహా పుష్పార్చన పూజా కార్యక్రమాలలో పాల్గొని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠాధిపతి శ్రీ సిద్దేశ్వరానంద భారతీ స్వామి వారి దివ్య ఆశీస్సులను అందుకున్నారు. పీఠం నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీగిరి ఆలయాభివృద్ధికి ఆలయ నిర్వాహకులు చేస్తున్న కృషిని సిద్దేశ్వరానంద భారతీ స్వామి అభినందించారు. కుర్తాళం పీఠం చీఫ్ ఆపరేషన్స్ ఆఫీసర్ శశి భూషణ్, పీఠం బృంద సభ్యులు మూర్తి రాజు, మాచవోలు రమేష్ పండిట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు ఉద్యమస్ఫూర్తి ఆదర్శప్రాయం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)
అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, పోలీస్



సిబ్బంది శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శ్రీరాములు తెలుగు వారి కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ 58 రోజులు ఆమరణ నిరాహార దీక్షతో ఆత్మార్పణ చేసి అమరుడయ్యాడని, ఆయన బలిదానం ఫలితంగా1953 అక్టోబరు 1న కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం అవతరించిందని, భారతదేశంలో బాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడయినాడని పేర్కొన్నారు. గాంధీ మార్గంలో నడిచి అనేక ఉద్యమాలలో ప్రముఖపాత్ర వహించారని, సత్యము, అహింస ఆశయాలతో హరిజనుల ఉద్దరణకు పాటుపడ్డాడని, అంటరానితనం నిర్మూలన గావించేందుకు ఆయన కృషి ఎనలేనిదని కొనియాడారు. గొప్ప దేశభక్తుడు, సమాజసేవకుడు, పీడిత ప్రజల పక్షపాతి, అసలైన గాంధేయవాది, ఆమరజీవి పొట్టి శ్రీరాములు గారి ఉద్యమస్ఫూర్తి, కార్యదీక్షత, త్యాగనిరతి నేటి తరానికి గొప్ప ఆదర్శమని, ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ కె శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉలవపాడులో సూపర్ ఫాస్ట్ రైలు నిలుపుదల చేసేందుకు కృషి

### ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి
### శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి
### ఘన స్వాగతం పలికిన కొత్తరెడ్డిపాలెం గ్రామస్తులు





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, డిశంబర్ 15)
మండల పరిధిలోని కరేడు పంచాయతీ అలగాయపాలెం (కొత్త రెడ్డిపాలెం) గ్రామంలో ఆదివారం ఉదయం 8 గంటలకు జరిగిన శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.ముందుగా గ్రామస్తులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్చారణ మధ్య విగ్రహా శంకుస్థాపన పూజా కార్యక్రమం జరిగింది. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం ప్రజల ఆత్మీయ అనుబంధానికి ప్రతిగా నిలుస్తుందని, నిత్యం నేను కొలిచే శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనటం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఉలవపాడు నుంచి అలగాయపాలెం వచ్చే రోడ్డు వద్ద రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి, ఉలవపాడు రైల్వే స్టేషన్‌లో సూపర్ ఫాస్ట్ రైలు నిలుపుదల చేసేందుకు కృషి చేస్తానని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కందుకూరు నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని ఎంపీ పేర్కొన్నారు. నెల్లూరులో ఈరోజు మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, గ్రామీణ ప్రాంతంలో నిరుద్యోగ యువత ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఆంజనేయస్వామి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం లో రాష్ట్రానికి అస్తవ్యస్తంగా పరిపాలించారని, కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి సంక్షేమం ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ,యువ నాయకులు నారా లోకేష్ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే వృద్ధాప్య పెన్షన్ పెంపుదల శాశ్వత వికలాంగులకు 15000 రూపాయల పెన్షన్, మెగా డీఎస్సీ, అన్నా క్యాంటీన్లు, దీపం పథకం లాంటి మరెన్నో పథకాలను ప్రజలకు అమలు చేశారని ఎమ్మెల్యే తెలిపారు.. కందుకూరు నియోజక వర్గాన్ని అభివృద్ధి చేయడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్న పెద్దలు నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నియోజకవర్గ ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతు న్నామని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి త్రాగు నీరు అందించేలా చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పన సమకూర్చటమే లక్ష్యంగా పనిచేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానంతరం గ్రామస్తులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉలవపాడు మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు కూటమి నేతలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## కమలా హైస్కూల్లో బాస్కెట్ బాల్ కోర్టు, లాన్ టెన్నిస్ బాల్ కోర్టు ప్రారంభం





(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిశంబర్ 15)
స్థానిక కమలా హైస్కూల్ సిబిఎస్సి మార్కాపూరం నందు బాస్కెట్ బాల్ కోర్టు ,లాన్ టెన్నిస్ బాల్ కోర్టును ఆదివారం మర్కాపురం 1 టౌన్, 2 టౌన్ ఎస్ఐలు ఎం సైదా బాబు, ఎం రాజ్ మోహన్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు చదువుతో పాటు గేమ్స్ లో కూడా రాణించాలని సూచించారు. విద్యార్థులకు చదువుతో పాటు గేమ్స్‌ని కూడా ప్రోత్సహిస్తున్న కమలా విద్య సంస్థల కరస్పాండెంట్ పి పవన్ కుమార్‌ని అభినందించారు. కార్యక్రమంలో భాగంగా సైదాబాబుని, రాజ్ మోహన్‌ను కమలా హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ రంజన్, పాఠశాల కరస్పాండెంట్ పవన్ కుమార్, పిడిఎస్ రజనీష్, ఎస్ శ్రీకాంత్, హరిలాల్ నాయక్, శాలువాలతో సత్కరించారు.

## భాషాప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి శ్రీ పొట్టి శ్రీరాములు

### ఎమ్మెల్యే ఇంటూరి
### ఘనంగా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం







(షణ్ముఖ వెలుగు, కందుకూరు, డిసెంబర్ 15)
నియోజకవర్గంలోని గుడ్లూరు, కందుకూరు పట్టణంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు. ఆంధ్రప్రదేశ్ అవతరణ కొరకు ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించి కోట్ల మంది ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానుభావుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మద్రాస్ ప్రెసిడెంట్ రాష్ట్రంలో తెలుగువారు పడుతున్న ఇబ్బందులు చూసి తెలుగువారి ఐక్యత కోసం పోరాడి, ప్రత్యేక రాష్ట్రం కావాలని, తెలుగువారి అస్తిత్వాన్ని ఎలిగెత్తి చాటి, ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఎమ్మెల్యే కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ సంస్కరణ దినంగా ప్రకటించిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కందుకూరు నియోజకవర్గం ప్రజలు తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు ఆర్యవైశ్య నాయకులు తాతా లక్ష్మీనారాయణ, మురారి శెట్టి సుధీర్ కుమార్, గుర్రం అల్లూరయ్య, మురారిశెట్టి సుబ్బారావు, కొత్త వెంకటేశ్వర్లు కోట వెంకట నరసింహం కాకుమాని ప్రవీణ్, చీదేళ్ళ పిచ్చయ్య, కొత్తూరి శ్రీనివాసులు అమర మాల్యాద్రి, ఇన్నమూరి శ్రీనివాసులు పార్టీ నాయకులు చిలకపాటి మధుబాబు వడ్డెళ్ళ రవిచంద్ర, ముచ్చు శ్రీను, బెజవాడ ప్రసాద్, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, ముచ్చు వేణు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అత్యాధునిక టెక్నాలజీతో అత్యుత్తమ వైద్య సేవలు

### మీడియా సమావేశంలో
### ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఎండి డాక్టర్ పోతినేని రమేష్






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ 36వ వార్షికోత్సవం పరిష్కరించుకొని ప్రకాశం, కృష్ణ, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరాలు నిర్వహిస్తుందని, అందులో భాగంగా ఒంగోలులో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు పేర్కొన్నారు. హాస్పిటల్ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలులో ప్రస్తుతం ఉన్న 200 పడకల సామర్థ్యానికి అదనంగా మరో వంద పడకల సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రైవేట్ రంగంలో జిల్లాలోని అతిపెద్ద హాస్పిటల్ గ్రూపుగా నిలిచిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ప్రజల ఆరోగ్య రక్షణలో నిరంతరం అంకిత భావంతో పనిచేస్తుందని చెప్పారు. ఆసుపత్రి డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ, ఆరోగ్య శ్రీ సేవలను త్వరలో ప్రారంభించబోతుందని, దీని ద్వారా పేద , మధ్యతరగతి ప్రజలకు అధిక నాణ్యత గల వైద్య సేవలు అందుబాటులో రానున్నట్లు వివరించారు. భవిష్యత్తు ప్రణాళికలో భాగంగా ఆసుపత్రి పిల్లల గుండె చికిత్సలు, గుండె బైపాస్, కవాట మార్పిడి శస్త్ర చికిత్సలు, ఆధునిక గుండె ఎలక్ట్రో ఫిషిజియాలజీ సేవలను ఒంగోలు ప్రజలకు



అందించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యాచరణలో ఆసుపత్రి తక్కువ ఖర్చుతో అత్యాధునిక వైద్య సేవలు అందించే హాస్పిటల్‌గా నిలుస్తుందని తెలిపారు. రమేష్ క్లౌడ్ డాక్స్ మారుమూల గిరిజన ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలను అందించేందుకు ఐసీయూ సేవలను ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్య సలహాలను అందుబాటులోకి తీసుకురాబో తున్నారన్నారు. ఒంగోలు ఐసీయూ లో ఉన్న క్రిటికల్ కేర్ పేషంటును విజయవాడలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా నిపుణుల పర్యవేక్షణలో ఉంచే సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5జి అంబులెన్స్ ద్వారా రోగి తరలింపు సమయంలో రియల్ టైం మానిటరింగ్ అందుబాటులోకి తెచ్చామని, ఇది మరణాల రేటును తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. వైద్యరంగంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ పెంచడంలో భాగంగా అత్యాధునిక డ్రోన్ సేవలను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

అలాగే ఏవన్ ఆధారిత సిటీ, యాంజియో గ్రామ్, ఏఐఈసిజి, ఏఐ ఎకో, ఏఐఎంఆర్ఐ వంటి టెక్నాలజీలతో వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి సమయానికి వైద్యం అందించడం సాధ్యమవుతుందని, ఆధునిక టెక్నాలజీ సాయంతో రోగుల ఆరోగ్య ప్రమాణాలు గణనీయంగా మెరుగు పడతాయని విశ్వాసాన్ని డాక్టర్ రమేష్ బాబు వ్యక్తం చేశారు. ఉచిత మెగా సూపర్ స్పెషాలిటీ వైద్య శిబిరంలో ఎనిమిది వందల మందికి పైగా రోగులు ఉచిత వైద్య సేవలను పొందారని వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ హెడ్ డాక్టర్ నల్లూరి నితిన్, మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ వంశీకృష్ణ, స్ట్రాటజీ హెడ్ డాక్టర్ కళ్యాణ్, గ్రూపు బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# 17న ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డి జన్మదినోత్సవ వేడుకలు



### జిల్లాలో అన్నిచోట్ల ఘనంగా నిర్వహించాలి
### సేవా కార్యక్రమాలు చేపట్టాలి
### కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి జన్మదిన సందర్భంగా ఈ నెల 17వ తేదీన జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించాలని, అలాగే వివిధ సేవా కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలలో నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా, రాష్ట్ర స్థాయి వివిధ హెూదాలో ఉన్న పార్టీ నాయకులు, స్థానిక నాయకులతో కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సైదా పార్టీ శ్రేణులను కోరారు.

# పొట్టి శ్రీరాముల విగ్రహానికి నివాళులర్పించిన నగర పాలక కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఒంగోలులోని సివిఎన్ రీడింగ్ రూమ్ సెంటర్‌లో ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఒంగోలు నగర పాలక కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు. ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను భవిష్యత్తు తరాలకు తెలియజేస్తూ, ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని అన్నారు.



# నిరుద్యోగరహిత నెల్లూరు జిల్లా మా లక్ష్యం

### విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకగా ప్రారంభమైన మెగా జాబ్ మేళా







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, డిశంబర్ 15)

యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లాను నిరుద్యోగరహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు తెలిపారు. ఆదివారం విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న యువత కోసం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను వేమిరెడ్డి దంపతులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి వారి వారి విద్యార్హతలు తగ్గ ఉద్యోగం రావాలని కోరుకుంటున్నానన్నారు. మూడు నెలలకు ముందు నిర్వహించిన జాబ్ మేళాలో దాదాపు వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు దక్కాయన్నారు. ఈ సారి 100 కు పైగా ఐటి, నాన్ ఐటి కంపెనీలు ఎంప్లాయ్‌మెంట్ ఇస్తున్న నేపథ్యంలో మరింత ఎక్కువ మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముందన్నారు. ఉద్యోగావకాశాలు రాని యువతీ యువకులు నిరుత్సాహ పడొద్దని హితవు పలికారు. జాబ్



మేళా నిరంతర ప్రక్రియ అని, ప్రతి మూడు నెలలకు జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ విపిఆర్ ఫౌండేషన్ ద్వారా చేసే సామాజిక సేవలో భాగంగా నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నామన్నారు.

ఈ జాబ్ మేళా ద్వారా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నది కళ్ళలో ఆనందం చూడాలన్నది ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆశయమన్నారు. ఈ జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశం రాని వారెవరు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదన్నారు. టాటా కన్సెల్టెన్సీ వారు తమ స్కిల్ సెంటర్ ద్వారా యువతకు శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చారని, వారి సూచనలు పాటించి మరో మూడు నెలల తరువాత నిర్వహించే జాబ్ మేళాలో అవకాశాలు దక్కించుకోవచ్చున్నారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు.

ఏర్పాట్లను పరిశీలించి జాబ్ మేళాకు వచ్చిన యువతతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తనయులు అర్జున్‌రెడ్డి, నీలిమారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మణనాయుడు, నెల్లూరు డిప్యూటి మేయర్ రూప్ కుమార్ యాదవ్, బుచ్చిరెడ్డి పాళెం మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, తెలుగుదేశం నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ పటేల్ జీవితం

### మనకు నిత్య ఆదర్శప్రాయం
### జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్




(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, డిశంబర్ 15)

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారతదేశపు ఉక్కు మనిషిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ స్వాతంత్ర్య యోధుడిగానే కాకుండా స్వాతంత్ర్యానంతరం సంస్థానాలు భారతదేశములో విలీనం కావడానికి విశిష్ట కృషిచేసిన గొప్ప వ్యక్తి అని, పలు ఉద్యమాలలో ప్రముఖ పాత్ర వహించారని, దేశంలో సుమారు 565 కి పైగా స్వాతంత్ర్య రాజ్యాలను దేశంలో విలీనం చేసి ఐక్య భారత్ నిర్మాణానికి అలుపెరగని కృషి చేశారన్నారు. విశాల భారతావనిని ఏకతాటిపై నడిపించిన పటేల్ జీవితం మనకు నిత్య ఆదర్శప్రాయమని, భారతదేశ సమగ్రత కోసం ఆయన ఎంతో కృషి చేశారని, అందుకే ఆయనకు ఉక్కుమనిషి బిరుదు లభించిందని తెలిపారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానించిన టీటీడీ బోర్డు మెంబర్ జంగా

(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, డిశంబర్ 15)



గుంటూరు పట్టణంలోని చిన్మయ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర యాదవ ఉద్యోగుల ఆత్మీయ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన తిరుమల తిరుపతి దేవస్థాన బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన డాక్టర్ మొర్రి పిచ్చయ్యను ఘన సన్మానం చేశారు. ఈ ఆత్మీయ సదస్సుకు తుపాకుల మోహన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యారంగంలో మొర్రి పిచ్చయ్య విశేష కృషి చేసినందుకు ఈ అవార్డుకు ఎంపిక కావడం జరిగిందని, వీరి సేవలు అభినందనీయమని ప్రశంసించారు. కమిటీ అధ్యక్షులు మోహన్‌రావు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంలోను, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ ఎంప్లాయిస్ సొసైటీ రాష్ట్ర బాధ్యులు రామాంజనేయులు యాదవ్, కృష్ణయ్య యాదవ్, గణేష్ బాబు యాదవ్, వెంకటేశ్వర్లు యాదవ్, రమేష్ యాదవ్, హనుమంత రావు యాదవ్, కోటేశ్వరరావు యాదవ్, జ్ఞానేశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘన సన్మానం చేశారు. ఆత్మీయ సదస్సులో పాల్గొని తనను సన్మానించిన కమిటీ కార్యవర్గ సభ్యులకు డాక్టర్ పిచ్చయ్య ధన్యవాదాలు తెలిపారు.

# తెలుగువారి కోసం ప్రాణాలు విడిచిన మహనీయులు

### అమరజీవి పొట్టి శ్రీరాములు
### ఎంపిడిఓ భోగాని శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, డిశంబర్ 15)

తెలుగువారి కోసం ప్రాణాలు విడిచిన మహనీయులు కీర్తిశేషులు అమరజీవి పొట్టి శ్రీరాములు అని డిసెంబర్ 15 ప్రతి సంవత్సరం వారిని స్మరించుకుంటూ వారు చేసిన పోరాటాన్ని అందరికీ తెలిసేలా చెబుతూ వారి జీవితంలోని కొన్ని సంఘటనలను పోరాటాన్ని ఎలా ఎందుకు చేశారు అనే అంశాన్ని అందరికీ మార్కాపురం ఎంపిడిఓ భోగాని శ్రీనివాసులు తెలియజేశారు. మొదటగా ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా శ్రీ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి సేవలను గుర్తు చేసుకున్నారు. ఇందులో కార్యాలయ సిబ్బంది సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పలువురు పాల్గొని శ్రీ పొట్టి శ్రీరాములుకి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో ఆదివారం జరిగింది.


On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com